# 6. మంచితనం

ఓపిగ్గా ఊరంతా గాలించిన వాసు ఎట్లాగైతేనేం ఒక గదిని మాట్లాడి వచ్చాడు. ఎక్కువ అద్దెతో తక్కువ సౌఖ్యాన్ని కొనుక్కోవటాన్ని ఆ గది బాగా అర్థం చేసింది. ఆ పనీ యీ పనీ చూసుకొని కాలేజీలో జేరటమే ఆలస్యమైనందువల్ల, అందరూ ఏరి పారేసుకోగా మిగిలిన యీ గదితోనే ఒక విధంగా తృప్తి పడాల్సి వచ్చింది.

కిందిభాగాల్లో నాలుగైదు కాపరాలవాళ్ళూ పైన మేమూ వున్నాం. రెండురోజులు గడవకముందే నేను కనిపెట్టిన ఇంకో విషయం ఏమిటంటే – విధవ ఇంటావిడ ఏకైక పుత్రిక తనకు ఇంకోపని లేనట్టుగా ఆ దొడ్లో, షికార్లు చేస్తూ ఎప్పుడూ మా గదివైపే చూడటం. ఆమె అందమైంది మాత్రమే కాదు; ఆ చిలిపికళ్ళతో దారినిపోతూన్న పురుషుణ్ని కవ్వించగల దనేందుకు నేనే నిదర్శనం! కాలేజి గంటలు మినహా, మిగతా కాలాన్ని ఎలా పాడుచేసుకోవాలో తెలియక బాధపడటం ఇకముందు ఉండేట్టు కన్పించలేదు. గది మంచి ఉషారైన తావునే దొరికినందుకు ఒక విధమైన తృప్తికూడా కలిగింది.

ఒక వారం గడిచాక – ఒక సాయింత్రం నేను గది జేరేప్పటికి వాసు కిటికీదగ్గరగా కుర్చీవేసుకొని, తెరిచిన పుస్తకం పేజీలు గాలికి కొట్టుకుంటూన్నా లెక్క చెయ్యకుండా, కిటికీలోంచి సరాసరి దొడ్లోకి చూస్తున్నాడు. చప్పుడు చెయ్యకుండా పోయి చూద్దును... ఆమె వీడివైపు, వీడు ఆమెవైపూ – మాటలురాని పిల్లవాళ్ళు ఒకళ్ళవైపు ఒకళ్లు తమ హృదయాల్ని వెల్లడించేందుకు చూసేలాటి చూపుల్లో నిమగ్నులై వున్నారు.

"మొత్తానికే మంచి కాలక్షేపమే చేస్తున్నావే!" అన్నాను నవ్వుతూ. నన్ను చూసి ఆమె మాట్లాడకుండా ఇంట్లోకి వెళ్ళిపోయింది. వాసు మాత్రం చలించకుండా మొఖం మాత్రం చిట్లించి, "ఏమిటి?" అన్నాడు.

"సరేకాని వ్యవహారం ఎంతవరకూ వచ్చింది?"

"నీబొంద... అరేయ్ ఒక్కమాట చెప్తాను విను; నువ్వు ఏ దృష్టిగలవాడివో, మిగతాలోకమంతా నీకు అలాగే కన్పిస్తుంది. చదువుకోసం వచ్చిన నాకు ఈ వెధవ పనులే పనునుకున్నావట్రా?"

"కోపం వచ్చిందాయేం?"

"కోపంకాదురా....ఏదో చదువుకుంటూ కాస్త తల అటు తిప్పేప్పటికి నీకంత అనుమానం దేనికి? నువ్వు రోజూ యీ కిటికీలో కూర్చొని, తదేక ధ్యానంగా ఆమెవైపు చూస్తూంటావ్ కదా - అసలు నీకు ఆ వెధవ ఉద్దేశం వుండబట్టే అదంతా నామీద రుద్దాలని చూస్తూన్నావ్!" అన్నాడు.

అటూఇటూ తిప్పి యీ నేరాన్ని కాస్తా నా మెడకే తగిలించాడు. కాస్త మాట తప్పిద్దామని, "కాదు కాని, నువ్వు ప్రయత్నించరా" అన్నాను.

"ఛా....ఛా!...నేను అలాటివాణ్ణి కాదురోయ్! రెండేళ్ళు స్నేహంగావున్నా నువ్వు నన్ను అర్థం చేసుకోనే లేదు. నన్ను నేను పొగుడుకోవటంకాదు కాని...ఆమెవచ్చి నా చెయ్యిపట్టుకున్నా...యీ చదువు పూర్తయ్యేదాకా ఇలాటి వ్యవహారాల్లోకి మెడ దూర్చదల్చుకోలేదు" అన్నాడు ఖచ్చితంగా.

ఇక యీ ప్రస్తావనను పొడిగిస్తే ముందు నా ప్రవర్తనకే ఎసరు పడేట్టుందని ఊరుకున్నాను. ఆ రాత్రి మాత్రం కొంచెం ఆలోచించాను. వాసును మొదటినుంచీ చాలా మంది మంచివాడుగానే పరిగణిస్తారు. వాడు ఇల్లాటి పాడు పనుల్లో జోక్యం కలుగ జేసికోడని నాకు పూర్తినమ్మకం వుంది. ఖర్మంజాలక ఇవాళ కాస్త అనుమానంవేసి నా మనస్సులోని ఉద్దేశాన్ని వాడి మీద పెట్టేప్పటికి, వాడి అసలు గుణం కాస్తా బైటపడిపోయింది. ఇక 'యీ మంచివాణ్ణి' చూసి నేను కూడా మంచివాణ్ణిగా తయారవ్వాలని బుద్ధి పుట్టింది. నాలాగే ప్రతివాళ్ళూ ఇలాగే మంచి అందగత్తెలకోసం బాధపడుతూంటారనుకోవటం మిథ్యేనేమో ననిపించింది.

ఏదో రాత్రి నిశ్చయించుకున్నానే కాని - ఆమె అటు దొడ్లోకి రావటంతోనే, వెధవమనస్సు ప్రోద్బలంవల్ల మళ్ళీ అటే చూడాలనిపించింది. పోనీ మెల్లిమెల్లిగా తగ్గుదామనే పద్ధులోవున్నా, ఆమె నాలుగుసార్లు తల అటూ, ఇటూ తిప్పి ఇచ్చే ప్రోత్సాహాన్ని చూస్తే - ఏదో ధైర్యం వెన్నాడుతూనే వుంది.

"ఏమిటే - ఆ దొడ్లో ఎప్పుడూను? ఈడొచ్చిన పిల్లవి - అక్కడ దేనికే, ఇంట్లోకి రాక?" అంటోంది తల్లి, ముంగలిలో నిలబడి.

ఇదంతా నన్ను చూసేనని నాకు తెలుసు. మెల్లిగా దృష్టిని మరోదిక్కుకు జరిపి, కాస్త ఇవతలికి వచ్చి ఇంకేమంటుందోనని పాముచెవుల్తో వింటున్నా.

"కాలేజీకుర్రాళ్ళు మంచివాళ్ళుకాదే!" అని తల్లి పెద్ద రిమార్కు పాసుచేసి, ఇంట్లోకి వెళ్ళిపోయింది. నాగుండెల్లో రాయిపడ్డది. వచ్చిన పదిరోజులకల్లా యీ ఇంటివాళ్లచేత చెడ్డవాణ్ణి అనిపించు కుంటున్నాను కాబోలు! నన్ను పట్టి మా కాలేజీకంతకూ చెడ్డపేరు రావటం కూడా నాకు ఇష్టంలేదు.

సాయింత్రం గదిలోకూర్చొని ఒక బండలెక్కతో తల బద్దలుకొట్టుకుంటున్నా.

"అమ్మ –"

ఉలిక్కిపడి తలెత్తి చూశా. ఆమె గుమ్మం దగ్గర నిలబడి నావైపు చూస్తోంది. ఆమెను యీ నిరపాయకరమైన స్థలంలో చూడటంలో ఏదో కొత్తదనం స్ఫురించింది. దాంతోపాటు వాంఛా, ఆతృతా, భయమూ ఒకదాని వెనుక ఒకటి నాలో తీవ్రంగా ప్రవేశించినాయ్.

"ఏమిటి?" అన్నాను, కాస్త స్థిమితపడి.

"అద్దె ఇస్తారేమోనని –"

"ఇంకా నెల కాందేనా?"

"ఎడ్వాన్సుగా."

"వాడు ఇస్తానన్నాడేమో?"

"ఏమో...ఇస్తారేమో అడిగిరమ్మంది" ద్వారాన్ని పట్టుకొని వేళ్లాడుతోంది. ఎలా సమాధానం చెప్పినా, సంభాషణ తెగిపొయ్యేస్థితికి వచ్చిందననే దిగులుపుడుతోంది.

"వాడు లేడే!" అన్నాను.

"పోనీ మీరివ్వకూడదూ?"

"ఎంత?"

"ఏమో?...పోనీ రాత్రికి రమ్మంటారా?"

ఆ చివర మాటతో నాకు కన్ను తెరిచినట్టయింది. ఆమె ఏ అర్థంలో అన్నా, నాకు కావాల్సినవిధంగా దాన్ని ఉపయోగించుకొని, ఇక ముందు యీవేధవసమస్యతో తల బద్దలుకొట్టుకోకుండా, అటో ఇటో తేల్చుకోవటమే నాకు మంచిదిగా తోచింది.

"రాత్రిదాకా దేనికీ....ఇప్పుడే ఇస్తాను – ఇట్లారా!" అన్నాను. ఆమె దగ్గరకు రాగానే చెయ్యి పట్టుకున్నాను, వ్యవహారం ఇంత త్వరగా పక్వాన పడ్డందుకు సంతోషిస్తూ.

"ఏమిటండీ?" అంది విసురుగా.

ఇదోరకం ప్రణయకోపంగా తీసుకుంటూ, "అదే..." అని వెనక్కుపోతూన్న ఆమెను లాగసాగాడు.

"ఛా! నేను అలాటిదాన్ని కాదు..." అంది సీరియస్‌గా. క్షణంలో ఆమె ముఖం ఎఱ్ఱబారటం నా భయానికి కారణమైంది.

"ఫర్వాలేదు...ఫర్వాలేదు..." అంటున్నాను. గొంతులో కొట్టుకునే గుండెతో; కాని ఆమె విదిలించి కొరకొరా చూస్తూ, చరచరా వెళ్ళిపోయింది.

నాకు ముచ్చెమటలూ పోసినై. శృంగభంగమైతే అయింది కాని – ఎవరూ చూడలేదు కనుక సరిపెట్టుకోవచ్చు – యీ రహస్యాలు పెద్దవాళ్ల దాకా వెళ్తే నా

ప్రవర్తనకూ, నాకూ కూడా ప్రమాదం తప్పదు. తలుచుకున్న కొద్దీ భయమూ, అవమానమూ నన్ను వేధించి, ఆ స్థలంలో ఒక్క క్షణం కూడా ఉండనివ్వకుండా తరిమేసినై.

ఎల్లాగో నాలుగుమెతుకులు నంజి, ఏమీ తోచక పోవటంవల్లా, ఒక్కణ్ణీ గదికి వెళ్లటానికి భయమెయ్యటం వల్లా, హొటల్ అరుగు మీదనే కూర్చొని, వాసుకోసం ఎదురు చూడసాగాను.

ఎల్లాగైతేనేం తొమ్మిదన్నరకు వాడిదర్శనమైంది. వాడి భోజనమయ్యాక, మెల్లిగా సంగతంతా వాడి చెవిన వేశా.

"ఇందాక వాళ్ళమ్మ నన్ను పిలిచి ఏమందో తెలుసా?" అన్నాడు, అంతా విన్నాక.

నేను మాట్లాడలేదు.

"మీరు మంచివాళ్లని గది అద్దెకిచ్చాను. ఆ రెండో ఆయన ఇంత చెడ్డవాడని తెలుస్తే-"

"ఐతే అంతా చెప్పిందన్నమాట?"

"ఆc." అని తలతిప్పాడు.

"ఇప్పుడు ఏం చేద్దామంటావ్?" అన్నాను.

వాడు కాస్త ఆలోచించి, "అబ్బాయీ! ఐదారు రోజులపాటు ఆమెకళ్ళ పడకుండా ఉండటమే మంచిది. కనుక నువ్వు యీబండికి మీవూరు వెళ్ళిపో. పరిస్థితులుచూసి ఉత్తరం రాస్తాను. లేదా ఇంకో గది చూస్తాను....." అన్నాడు.

"గుడ్డలు కూడా లేవే!"

"అదంతా తరువాత చూచుకోవచ్చు - పరువుపోతూంటే గుడ్డలేంటి?... బయలుదేరు -" అని నన్ను సాగనంపాడు.

తీరా స్టేషన్‌కు వెళ్ళేప్పటికి బండికాస్తా వెళ్లిపోయింది. మళ్లీ తెల్లారేదాకా బండికూడా లేదు. ఉన్న నాలుగు బెంచీలనూ ప్రయాణికులు శయ్యలు చేసుకున్నారు. ఎంతసేపని ఈ చలిలో, యీ దోమలమధ్య మేలుకు కూర్చోను?

ఈ అర్ధరాత్రి ఎవరు మేలుకుంటారు? మెల్లిగా గోడ దూకి వెళ్ళి గదిలో పడుకొని, తెల్లారకముందే ఉడాయిస్తే సరిపోదూ? ఈ ఆలోచనతో మెల్లిగావెళ్ళి, చప్పుడు కాకుండా గోడదూకి, మేడ మెట్లెక్కాను.

గదిలో మాటలు వినిపిస్తూంటే, ఆగి ఏమిటా అని వినసాగాను. ఒక స్త్రీ కంఠం నవ్వుతోంది. నేను లేనుకదా అని వీడు గదిలోకి ఎవర్నన్నా జేర్చాడేయేం? మెల్లిగా కిటికీ చెక్కలో మధ్యవున్న కాళీలోంచి చూశాను. లాంతరు తగ్గించి, నా బట్టల పెట్టెమీద

మిణుకు మిణుకుమంటోంది. నా క్యాంపు కాటును వాసూ, ఆ అమ్మాయి పంచుకొని సరసాలాడుతున్నారు.

పొరపడ్డానేమోనని, కళ్లు నలుచుకొని మళ్లీ చూశాను. నిస్సందేహంగా ఆమే! నవ్వేప్పుడు గుంటలుపడే ఆమె చెక్కిళ్ళు కూడా స్పష్టంగా కనిపిస్తున్నయ్! నాకు ఒళ్లు మండింది...వీడు, యీ 'మంచివాడు' ఇదేంపని?నన్ను పరువుకోసం సాగనంపి, నా క్యాంపు కాటుతోనే ఇంత ఆనందాన్ని అనుభవిస్తూ, నాకు అన్యాయం చెయ్యటం భరించరానిదైంది. ఆమె 'ఇలాంటిది' కాని ఆమె - నన్ను విదిలించిన ఆమె ....ఇదేమిటి?

"వాడింకా నాలుగైదు రోజులదాకా రాడులే! రేపే ఉత్తరం రాశానంటే మరోవారం రోజులదాకా అక్కడే కూర్చుంటాడు....రేపు కూడారా" అంటున్నాడు వాసు.

వెంటనే వీడి ముందు ఫైరువర్క్‌లాగు ప్రత్యక్షమై వీడిరోగం కుదురుద్దామనుకున్నాను; కాని ఏడ్చిపోతాడని ఊరుకున్నాను.

"సరేలెండి...ఇవ్వరూ?" అంది ఆమె.

వాడులేచి, పెట్టె తెరిచి మూడురూపాయలు ఆమెకు ఇచ్చాడు.

"మీరు చాలామంచివారండీ!" అంటోంది ఆమె. వీడి మంచితనమేమిటో, దాన్ని ఎట్లా సంపాయిస్తున్నాడో నాకు బాగా అర్థమైంది.

"ఇంక వెళ్తాను-" అంది ఆమె.

"కాస్సేపుండరాదూ?"

"ఒకటిన్నరయింది - ఇవ్వాల్టికి చాల్లెండి-" అని లేచింది.

చప్పున మెట్లు దిగి చీకట్లోనక్కాను. వాసు ఆమెను బైటికిపంపి, తలుపు వేసినచప్పుడు వినిపించింది. మెల్లిగాదిగి వస్తూన్న ఆమెకు, చివరి మెట్టు దగ్గర ఎదురయ్యాను. ఆమె ఆశ్చర్యపడుతూన్నట్టు కనుబొమలు ఎగరెయ్యటం, ఆమె మీదపడే మునిపిసాలిటీ ఎలక్ట్రిక్ లైటు వెలుగులో కన్పించక పోలేదు. అరుస్తుందేమోనని, "నేనేలే!" అన్నాను.

"మంచిదానివే!"

ఆమె మాట్లాడలేదు.

"నీతో మాట్లాడాలి కాని... మెల్లిగా పై డాబా మీదికిపా-" అన్నాను.

"ఏం మాట్లాడతారు?"

"చెప్తానుగా -" ఆమె తలవూపి నాకు ముందు దారి తీసింది.

* * *

తెల్లారుతూండగానే వచ్చి గది తలుపు కొట్టాను. వాసు నిద్దర కళ్లను తడుచుకుంటూ, విసుక్కుంటూ వచ్చి తలుపు తీసి, ఆశ్చర్యంతో, "అప్పుడే వచ్చావేరా?" అన్నాడు.

నేను గదిలో ప్రవేశించి. "ఏం లేదు... అరె! నా కాంపుకాట్ మీద బిఛాణా పరిచావేం?" అన్నా.

"నువ్వు లేవుకదా అని వేశానోయ్-"

"ఆ అమ్మాయి తల్లి ఇంకేమన్నా అందా?"

"అదే...తల్లికూతుళ్ళిద్దరూ కూడా నేను మంచివాణ్ణనీ, నువ్వు చెడ్డవాడివనీ-"

"అబ్బాయీ! నువ్వెందుకు మంచివాడివో నాకు తెలుసు. నువ్వు మూడు రూపాయిల్తో కొన్న మంచితనాన్నే నేను నాలుగు రూపాయిలకు కొన్నాను తెలుసా?"

వాడు అదిరిపడ్డాడు. ఇక దాచి లాభం లేదని, నవ్వుతూ, "వాళ్ళమ్మ నాతో యేమీ అనలేదురా! నేను సినిమాకు వెళ్లి వచ్చేటప్పటికి హొటల్‌దగ్గర సంగతంతా నువ్వు చెప్పేదాకా, నాకు తెలియనే తెలియదు. ఆ తరువాత వస్తూంటే, వాళ్లమ్మపిలిచి, 'అమ్మాయిని పంపుతాను...డబ్బిచ్చి పంపండి' అనిచెప్పి..." అన్నాడు. నేను చేసిపెట్టిన దారేనన్న మాట!

"పోతేపోయింది కాని, భలేగది మాట్లాడావురా - మంచివాడా!" అన్నాను.

"మన మంచితనాన్ని చెడగొట్టుకోకుండా ఉండాలిరా!" అన్నాను.

అట్లాగే మూడు నెలలపాటు ఇద్దరమూ మహామంచి వాళ్లుగా ఉన్నాం. తరువాత ఒక సాయింత్రం కాలేజినుంచి వస్తూండగా వాళ్ళమ్మ వాసును పిలిచి ఏదో మాట్లాడింది. మాట్లాడే వ్యవహారాలన్నీ వాసే చూస్తుండే వాడు.

"ఏమిట్రా అది?" అన్నాను వాడు గదికి రాగానే.

"ఏం లేదు - కూతురు కార్యం చేస్తుందట; ఏమన్నా డబ్బుంటే సర్దమని అడిగింది-"

"ఇప్పుడేం కార్యం?" అన్నాను.

"ఆమెకు రెండో నెలరా!" అన్నాడు.

తలతిప్పి, "పోనీలే....మన మంచితనం కాస్తా ఆ భర్త మీంచి పోతుంది" అన్నాడు.

"ఇక మంచితనం సాగదురా. ప్రతిఫల శూన్యంగా డబ్బు ఇవ్వాల్సి వస్తుంది కనుక, రేపే గది మారుద్దాం-" అన్నాడు.

"సరే" అన్నాను నవ్వుతూ.

– జులై, *1942*